సాక్షి
ఖమ్మం
గురువారం । 8 । జూన్ । 2023



రైళ్లిక రయ్‌రయ్!
కాజీపేట-కొండపల్లి సెక్షన్‌లో మూడో రైల్వే లైన్ పనులు చురుగ్గా సాగుతుండడంతో రైళ్లు పరుగులు తీయనున్నాయి.
8లో



మృగశిర వచ్చేసింది!
మృగశిర కార్తె గురువారం ప్రారంభం కానుండగా చేపల అమ్మకానికి మత్స్యకారులు సిద్ధమయ్యారు.
8లో

గరిష్ఠం / కనిష్ఠం
44° / 29°

వాతావరణం
జిల్లాలో గురువారం కూడా ఉష్ణోగ్రత ఎక్కువగానే ఉంటుంది. ఉదయం నుంచే ఎండ మొదలై గంటగంటకు పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రేపు జాబ్ మేళా

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని టేకులపల్లి మోడల్ కెరీర్ సెంటర్‌లో జిల్లాలోని నిరుద్యోగ యువతకు శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్తిక్ గ్లోబల్ ప్రైవేటు లిమిటెడ్ శామీర్‌పేట ఆధ్వర్యంలో 20 మిషన్ ఆపరేటర్ పోస్టులు భర్తీ చేస్తారని పేర్కొన్నారు. 10వ తరగతి లేదా ఐటీఐ, ఇంటర్ పాసైన వారు 9వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. ఉద్యోగం సాధించిన వారికి నెలకు రూ.16,513 నుంచి రూ.17,573 వరకు వేతనం ఉంటుందని తెలిపారు.

ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోండి

ఖమ్మం సహకారనగర్: బీసీ కుల, చేతివృత్తిదారులు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం కోసం ఈనెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఒక ప్రకటనలో సూచించారు. ప్రభుత్వం బీసీ కుల, చేతివృత్తుల వారికి రూ.లక్ష సాయం అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈమేరకు 21 నుంచి 55 ఏళ్ల వయస్సు కలిగి, వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు కలిగిన అర్హులని చెప్పారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి ఆర్థిక లబ్ధి పొందని వారు https://tsobmmsbc.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా అన్ని అర్హత పత్రాలు జత చేస్తూ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఓ ప్రకటనలో సూచించారు.

ఈనెల 11న కవి సమ్మేళనం

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 11న ఖమ్మంలోని లకారం ట్యాంక్‌బండ్ వద్ద కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వీ.పీ. గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్ల తెలంగాణ ప్రగతి ప్రస్థానం, తెలంగాణ అస్తిత్వాన్ని కవితల రూపంలో రాయాలని, ఇక్కడ పాల్గొనే కవుల నుంచి ఐదుగురిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు పేరు, వివరాలను ఈనెల 9వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా కలెక్టరేట్‌లోని డీపీఆర్వో కార్యాలయంలో కానీ, 73967 64337 నంబర్‌కు కానీ తెలియజేయాలని సూచించారు.

అన్నదాతలకు ఊరట!

- పంటల మద్దతు ధర పెంపునకు కేంద్రం ఆమోదం

ఖమ్మంవ్యవసాయం: కేంద్ర ప్రభుత్వ క్యాబినెట్ పంటల మద్దతు ధర పెంచుతూ బుధవారం తీర్మానించింది. జిల్లాలో ప్రధానంగా సాగు చేసే వరి కామన్ వెరైటీ ధర ప్రస్తుతం క్వింటాకు రూ.2,040 కాగా రూ.2,183కు, 'ఏ' వరి ధర రూ.2,060 నుంచి రూ.2,203కు పెంచారు. తద్వారా వరి క్వింటాకు రూ.143 పెంచినట్లయింది. అలాగే, క్వింటా పత్తి ధరను రూ.6,380 నుంచి రూ.7,020కు పెంచగా, మొక్కజొన్న ధర రూ.1,962ను రూ.2,090కు పెంచారు. అలాగే, క్వింటా పెసల ధర రూ.7,755 నుంచి రూ.8,558కు, రూ.5,850 ఉన్న వేరుశనగ ధరను రూ.6,377కు పెంచుతూ తీర్మానించారు. ఇవేకాక ఇతర పంటల ధరలను కూడా కొంత మేర పెంచగా.. కొత్త ధరలు ఈ ఏడాది అక్టోబర్ 1నుంచి 2024 సెప్టెంబర్ 30 వరకు అమల్లో ఉంటాయి.

ఉచిత విద్యుత్ పథకాన్ని వినియోగించుకోండి

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల కోసం అమలుచేస్తున్న ఉచిత విద్యుత్ పథకాన్ని వినియోగించుకోవాలని ఖమ్మం విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఏ.సురేందర్ సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం 2018 నుంచి 0-101 యూనిట్ల వరకు ఉచితంగా అందిస్తోందని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 52,217 మంది ఎస్సీలు, 31,960 మంది ఎస్టీలు ఈ పథకాన్ని వినియోగించుకుంటుండగా, ఇంకా రెండు వర్గాల్లో కలిపి 30వేల మందికి అర్హులు ఉన్నారని పేర్కొన్నారు. ఈమేరకు మీ సేవా కేంద్రం నుంచి తీసుకున్న కుల ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, సెల్ నంబర్, కరెంటు బిల్లు జిరాక్స్‌ను విద్యుత్ కార్యాలయాల్లో సమర్పించి ఉచిత విద్యుత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ కోరారు.

కమనీయం.. రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఓసారి తీస్తే సరి!



గత ఏడాది అధిక సాంద్రతతో సాగు చేసిన పత్తి

'సింగిల్ పికింగ్' పత్తిపై రైతుల ఆసక్తి

- ఈ రకం విత్తనాలతో ఆశాజనకంగా దిగుబడి
- తగ్గనున్న చీడపీడల బెడద..
- వానాకాలంలో విత్తనాలకు పెరిగిన డిమాండ్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఈ ఏడాది అధిక సాంద్రత విధానంలో 'సింగిల్ పికింగ్' పత్తి సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ విధానంలో దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో ఇటువైపు అడుగులు వేస్తున్నారు. గతేడాది జిల్లాలో ఈ విధానం ద్వారా 541 ఎకరాల్లో పత్తి సాగు కాగా.. ఎకరాకు సగటున 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. రెండు, మూడు సార్లు తీసే పంటకైతే చీడపీడలు, అకాల వర్షాలతో ఇబ్బంది తలెత్తుతుండడం.. ఒకేసారి తీసే పత్తితో దిగుబడి బాగుండడంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే స్థానికంగా విత్తనాలు అందుబాటులో లేక గుంటూరు, విజయవాడ వంటి ప్రాంతాలకు వెళ్లి మరీ కొనుగోలు చేస్తున్నారు.

ప్రోత్సహించిన ప్రభుత్వం

గత ఏడాది వానాకాలం జిల్లాలో 2,21,743 ఎకరాల్లో పత్తి సాగు కాగా.. అప్పటి నుంచే సింగిల్ పికింగ్ పత్తి సాగు అమల్లోకి వచ్చింది. ఈ విధానంలో అధిక దిగుబడి సాధించే అవకాశం ఉండటంతో జిల్లాలోని ఏడు మండలాల్లో రైతులను ప్రభుత్వం ప్రోత్సహించింది. రఘునాథపాలెం, మధిర, కామేపల్లి, చింతకాని, కొణిజర్ల, ముదిగొండ, తిరుమలాయపాలెం మండలాలను ఎంచుకోగా, 541 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. సాధారణ పత్తి సాగుతో ఐదు నుంచి ఏడు క్వింటాళ్ల దిగుబడి రాగా.. అధిక సాంద్రత పద్ధతిలో యాజమాన్య పద్ధతుల ఆధారంగా సగటున 15 క్వింటాళ్ల వరకు దిగుబడి రావడంతో రైతులు మరికొందరు ఈసారి ముందుకొస్తున్నారు.

మరో పంటకు అవకాశం..

పత్తిని వర్షాధారంగా సాగు చేస్తారు. సాధారణ పద్ధతిలో మూడు నుంచి నాలుగు సార్లు తీయాల్సి ఉంటుంది. అయితే అధిక సాంద్రత పద్ధతిలో ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే పత్తి తీస్తుండడం.. 90 శాతానికి పైగా మొదటిసారే చేతికి వస్తుంది. ఈ విధానంలో పత్తి రెండు తీతల తర్వాత నీటి వనరుల ఆధారంగా అపరాలు, మొక్కజొన్న, నూనెగింజల పంటల సాగుకు అవకాశముంది. కాగా, అధిక సాంద్రత పద్ధతిలో దాదాపు ఎకరానికి 15 వేల మొక్కలు నాటుతారు. దీంతో సాధారణ పద్ధతిలో ఎకరాకు రెండు విత్తన ప్యాకెట్లు అవసరం ఉండగా.. అధిక సాంద్రతలోనైతే ఐదు నుంచి ఆరు విత్తన ప్యాకెట్లు అవసరమవుతాయి.

విత్తనాలు దొరకడం లేదు..



గత ఏడాది అధిక సాంద్రత సాగు విధానంలో పత్తి సాగు చేస్తే దిగుబడి బాగానే వచ్చింది. కానీ ఈసారి ఆ విత్తనాలు దొరకడం లేదు. కొందరు గుంటూరు వెళ్లి తెచ్చుకుంటున్నారు. జిల్లాలో ఇలాంటి విత్తనాలను అధికారులు అందుబాటులోకి తీసుకురావాలి. – చిరసవాడ రాజు, రైతు, ఎదుళ్లచెరువు

ఆ విత్తనాలకు డిమాండ్

ఈ ఏడాది 2.20 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు.. అందుకు అనుగుణంగా ఐదు లక్షల విత్తన ప్యాకెట్లను అందుబాటులోకి తీసుకు రావాలని నిర్ణయించారు. అయితే అధిక ఉత్పత్తి వస్తుందంటూ రైతులు ఓ కంపెనీ విత్తనం కోసం పరుగులు తీస్తున్నారు. సీజన్ ఆరంభమవుతున్న నేపథ్యాన రెండు రకాల పత్తి విత్తనాలకు డిమాండ్ పెరిగింది. స్థానికంగా ఇవి లభ్యత లేకపోవడంతో గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్లి మరీ అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. సాధారణంగా 475 గ్రాముల పత్తి విత్తన ప్యాకెట్ ధర రూ.853 ఉండగా.. డిమాండ్ ఉన్న పత్తి విత్తనాలను వ్యాపారులు బ్లాక్ చేసి ధర పెంచినట్లు సమాచారం. గత ఏడాది వాతావరణ పరిస్థితులు, విత్తన రకాల ఆధారంగా సాధారణ పద్ధతిలో సాగు చేస్తే దిగుబడి అంతంతే రావడం, అధిక సాంద్రత పద్ధతిలో మంచి ఫలితాలు ఉండడంతో రైతులు అటే మొగ్గు చూపుతున్నారు.

ఆశాజనకంగా ఫలితాలు



కొందరు రైతులు విత్తనాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. అధిక సాంద్రతతో ఎక్కువ దిగుబడి సాధించే విత్తనాలు స్థానికంగానూ లభిస్తున్నాయి. ఈ విధానంలో ఫలితం బాగుండడంతో పలువురు రైతులు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు.
– ఎం.విజయనిర్మల, జిల్లా వ్యవసాయాధికారి

దేశానికే అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ..



వైరాలో మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు, పక్కన ఎమ్మెల్యే రాములునాయక్ తదితరులు

- రైతుల సంక్షేమమే కేసీఆర్ ధ్యేయం
- సాగునీటి దినోత్సవంలో ఎంపీ నామా నాగేశ్వరరావు

వైరా/నేలకొండపల్లి: సాగునీటి ప్రాజెక్టులు లేక రైతులు విలవిల్లాడుతున్న నేపథ్యాన ఏర్పడిన తెలంగాణలో సీఎం కేసీఆర్ దూరదృష్టితో ఇప్పుడు రాష్ట్రం దేశానికి అన్నం పెట్టే స్థాయికి ఎదిగిందని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు వెల్లడించారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాగునీటి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా రిజర్వాయర్, నేలకొండపల్లి మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన సమావేశాల్లో ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు లావుడ్యా రాములునాయక్, కందాల ఉపేందర్‌రెడ్డితో కలిసి ఎంపీ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపీ నామా మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావం తర్వాత కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వడంతో సాగునీటికి ఢోకా లేకుండా పోయిందన్నారు. తెలంగాణ లో రైతుల కన్నీళ్లు తుడిచేందుకు సీఎం కేసీఆర్ రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారని, మిషన్ కాకతీయ ద్వారా చెరువులకు పునరుద్ధరించారని తెలిపారు. ఈమేరకు వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం, కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాగా, నేలకొండపల్లి సభలో ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక సంక్షోభం వల్ల రైతు రుణమాఫీని పూర్తి స్థాయిలో చేయలేకపోయామన్నారు. కానీ మండ్రాజుపల్లి రైతు వేదికగా ఏటా రూ.60వేల మేర రైతుబంధు సాయం పొందుతున్న కొందరు అబద్ధాలు చెప్పారని తెలిపారు. ఏది ఏమైనా అందరికీ మంచి చేయాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో జలవనరుల శాఖ ఈఈలు బాబూరావు, వెంకటేశ్వర్లు, వైరా ఏసీపీ ఎం.ఏ.రెహమాన్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, జెడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, మార్కెట్ చైర్మన్ బీ.డీ.కే.రత్నం, తహసీల్దార్ నారపోగు అరుణ, మున్సిపల్ కమిషనర్ పి.వెంకటేశ్వర్లుతో పాటు ముళ్లపాటి సీతారాములు, ఇంటూరి శేఖర్, వజ్జా రమ్య, వరప్రసాద్, శాంత, శాఖమూరి సతీష్, మన్మథరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంలో ప్రగతి నివేదికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మధు తదితరులు

ప్రతీ ఎకరాకు సాగునీరు

ఖమ్మంఅర్బన్: తెలంగాణ ఏర్పాటయ్యాక అమలుచేస్తున్న పథకాలతో అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలుస్తోందని ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. ఖమ్మం ప్రకాష్‌నగర్ చెక్‌డ్యాం వద్ద జరిగిన సాగునీటి దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ గత పాలకులు కాల్వలు తవ్వి కాసులు సంపాదిస్తే.. తెలంగాణలో మాత్రం ప్రతీ ఎకరానికి సాగునీరు అందుతోందని చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి, మంత్రి కేటీఆర్ సహకారం, జిల్లా మంత్రి పువ్వాడ అజయ్ చొరవతో గతంతో పోలిస్తే ఖమ్మం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ ఆదర్శసురభి, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, జలవనరులశాఖ సీఈ శంకర్ నాయక్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు మందడపు సుధాకర్, నర్సింగరావు, అనన్య, ఉదయ్‌ప్రతాప్, ధన్‌కుమార్‌రెడ్డి, వెంకట్రాం, గజ్జల లక్ష్మి, ధనాల రాధ, రుద్రగాని శ్రీదేవి, ఉపేందర్, సరస్వతి, వెంకన్న, ప్రసన్న, కృష్ణ పాల్గొనగా జలవనరుల శాఖ ప్రగతి నివేదికను ఆవిష్కరించారు.

నిప్పుల కుంపటి

- బాణాపురంలో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత
- గణనీయంగా పెరిగిన విద్యుత్ వినియోగం



ఎండ తీవ్రతతో నిర్మానుష్యంగా మారిన బాణాపురంలోని రహదారి

ఖమ్మంవ్యవసాయం: సూర్యుడు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాడు. అధిక ఉష్ణోగ్రత, ఉక్కపోత ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మృగశిర కార్తె వచ్చిందంటే వానాకాలంలోకి అడుగుపెట్టినట్లే భావించాల్సి ఉన్నా ఈ ఏడాది అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. మృగశిర కార్తె గురువారం ప్రవేశించనుండగా, బుధవారం జిల్లాలో ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయిలో నమోదయ్యాయి. ముదిగొండ మండలం బాణాపురంలో అత్యధికంగా 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, జిల్లావ్యాప్తంగా 39.7 నుంచి 45.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారిక గణాంకాలు వెల్లడించాయి. ఎండవేడి, వడగాలులతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి వెనుకడుగు వేస్తుండగా, కార్మికులు మధ్యాహ్నం వేళ పనులు చేసేందుకు ఇబ్బంది పడుతున్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

ఎండ తీవ్రత కారణంగా జిల్లాలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ వినియోగం లేకపోయినా సాధారణానికి మించి వినియోగం జరుగుతోంది. ఎండవేడి నుంచి ఉపశమనం కోసం ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలను వినియోగిస్తుండడంతో ఈ పరిస్థితి ఎదురవుతోందని చెబుతున్నారు. జిల్లాకు నిత్యం 4.34 మిలియన్ యూనిట్ల కోటా ఉండగా.. సోమవారం(5వ తేదీ) 4.86 మిలియన్ యూనిట్లు, మంగళవారం 5.08 మిలియన్ యూనిట్లు, బుధవారం 5.14 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైంది. ఇందులో సింహభాగం గృహ విద్యుత్ వినియోగమే ఉందని అధికారులు చెబుతున్నారు. కాగా, జిల్లాలోని బాణాపురంలో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, మధిర ఏఆర్ఎస్, నాగులవంచలో 44.8, ఖానాపురంలో 44.6, మధిర, ఎర్రుపాలెం, సిరిపురంలో 44.5, పమ్మిలో 44.4, రఘునాథపాలెం, నేలకొండపల్లి, పెద్దగోపతి, ఖమ్మం ఎన్నెస్పీ, ముదిగొండ, తిమ్మారావుపేట, పల్లెగూడెం, ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో 44.3, సత్తుపల్లిలో 44.2, చింతకాని, కొనిజర్లలో 44.0, బచ్చోడు 43.6, వేంసూరు 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

వైభవంగా అష్టలక్ష్మి పూజలు

మండలంలోని నారాయణపురంలో శ్రీఅభయాంజనేయస్వామి, బొడ్రాయి, ముత్యాలమ్మతల్లి విగ్రహాల ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం వందలాదిగా హాజరైన మహిళలు అష్టలక్ష్మి, కుంకుమ పూజ నిర్వహించారు. ఈ పూజలకు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరుకాగా, అర్చకులు, నిర్వాహకులు స్వాగతం పలికారు. అలాగే, బేతుపల్లిలో నిర్మించిన శ్రీకృష్ణ ఆలయ ప్రతిష్ఠాపనతోత్సవంలో ఎమ్మెల్యే సండ్ర పాల్గొని పూజలు చేశారు. ఈమేరకు శ్రీకృష్ణ నామస్మరణతో గ్రామం మార్మోగగా, భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. – సత్తుపల్లి



నారాయణపురంలో చెన్నారాయుడు దేవుళ్లతో ఎమ్మెల్యే వెంకటవీరయ్య

సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం..

- పట్టాలు, చెక్కుల పంపిణీకి ఏర్పాట్లు
- కలెక్టర్ వీ.పీ.గౌతమ్



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ మధుసూదన్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 9న సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, నిరుపేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం ఆయన తహసీల్దార్లతో ఇళ్ల పట్టాల పంపిణీ, కుల, చేతివృత్తుల వారికి ఆర్థిక సాయం తదితర అంశాలపై వీసీ ద్వారా సమీక్షించారు. జిల్లాలో 58 ఎకరాల స్థలాన్ని గుర్తించగా, 4,526 దరఖాస్తులు అందినందున అర్హులను పారదర్శకంగా గుర్తించాలని తెలిపారు. అలాగే, సంక్షేమ దినోత్సవం రోజున మండలానికి 20 మంది చొప్పున అర్హులకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేయాలన్నారు. తొలుత సంక్షేమ సంబరాల నిర్వహణపై హైదరాబాద్ నుంచి వీసీ ద్వారా రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సూచనలు చేశారు. అలాగే, ఈనెల 14న జరిగే వైద్య దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు ఘనంగా చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు సూచించారు. ఇందుకోసం నియోజకవర్గానికి రూ.లక్ష చొప్పున నిధులు కేటాయిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు చెరువుల పండుగ

జిల్లావ్యాప్తంగా గురువారం చెరువుల పండుగను అధికారులు సమష్టి కృషితో విజయవంతం చేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆయన మండల స్థాయి అధికారులతో వీసీ ద్వారా సమావేశమై దిశానిర్దేశం చేశారు. జిల్లాలో 363 చోట్ల చెరువుల పండుగ జరగనుండగా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎస్.మధుసూదన్, అసిస్టెంట్ కలెక్టర్లు రాధికాగుప్తా, మయాంక్ సింగ్, డీఆర్వో శిరీష, బీసీ సంక్షేమ అధికారి జి.జ్యోతి, డీడబ్ల్యూఓ కృష్ణానాయక్, ఎస్సీ డీడీ కె.సత్యనారాయణ, జలవనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్, జెడ్పీ సీఈఓ అప్పారావు, సర్వే అండ్ ల్యాండ్ ఏడీ శ్రీనివాసులు, ఇరిగేషన్ అధికారి వెంకట్రాం, మత్స్యశాఖ ఏడీ ఆంజనేయస్వామితో పాటు తహసీల్దార్ శైలజ, కలెక్టరేట్ పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు, రాంబాబు, డీటీ రంజిత్ పాల్గొన్నారు.

చెరువుల పండుగకు వేళాయె..

- జిల్లాలో 363 చోట్ల నిర్వహణకు ఏర్పాట్లు
- బోనాలు, బతుకమ్మలతో ఊరేగింపు, అమ్మవార్లకు పూజలు
- జలాశయాల వద్ద సాంస్కృతిక సంబురాలు
- ఖమ్మంలో మూడు రోజుల పాటు 'ఫిష్ ఫుడ్ ఫెస్టివల్'



చెరువుల పండుగ సందర్భంగా ప్రదర్శించనున్న వలతో అధికారులు



రఘునాథపాలెం మండలం కోయచెలక చెరువు కట్టపై జరుగుతున్న ఏర్పాట్లు

ఖమ్మంవ్యవసాయం/ఖమ్మం అర్బన్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం 'ఊరూరా చెరువు పండుగ' నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నారు. ఈ పండుగలో మత్స్యకారులను భాగస్వాములను చేయనుండగా, గ్రామల నుంచి ఊరేగింపుగా జలాశయాల వద్దకు చేరుకుని సంబురాలు నిర్వహిస్తారు. బతుకమ్మ, బోనాలతో ఊరేగింపు, చెరువు కట్టలపై దేవతలకు పూజలు, మత్స్యకారుల ప్రదర్శనలతో సందడి నెలకొలనుంది.

363 చెరువుల వద్ద పండుగ

జిల్లాలో 1,429 చిన్నాపెద్ద చెరువులు, జలాశయాలు ఉండగా.. జల వనరుల శాఖ నిర్దేశించిన 362 చెరువులు, జలాశయాల్లో గురువారం ఊరూరా చెరువుల పండుగ నిర్వహించాలని నిర్ణయించారు. గురువారం సాయంత్రం ఐదు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ఈ ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయి. ఆయా గ్రామాల నుంచి మహిళలు బోనాలు, బతుకమ్మతో ర్యాలీగా రానుండగా, మత్స్యకారులు వలలతో ప్రదర్శన చేపట్టనున్నారు. ఇక చెరువు కట్టలపై ఉన్న అమ్మవార్లకు ప్రత్యేక పూజలు కూడా నిర్వహిస్తారు. ఇప్పటికే చెరువు కట్టల వద్ద శుభ్రం చేయించడంతో పాటు లైట్లు ఏర్పాటుచేశారు. ఈక్రమంలోనే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కళాకారులు ప్రదర్శనలు ఇస్తారు.

ప్రత్యేక ఆకర్షణగా మత్స్యకారులు

చెరువుల పండుగలో మత్స్యకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. మత్స్యకారుల సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా వలల ప్రదర్శన, జలాశయాల్లో ఈత, తెప్పల పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అలాగే, తెలంగాణ రాకముందు, వచ్చాక జరిగిన చెరువుల అభివృద్ధి, మత్స్యకారుల జీవనశైలిలో మార్పులను తెలిపేలా వీడియో ప్రదర్శనలు ఇవ్వడంతో పాటు ఫ్లెక్సీలు ఏర్పాటుచేయనున్నారు.

'మిషన్ కాకతీయ'తో జలకళ

కాకతీయుల నాటి చెరువులకు పూర్వవైభవం తీసుకొచ్చేలా తెలంగాణ ఏర్పడ్డాక మిషన్ కాకతీయ పథకాన్ని ప్రవేశపెట్టారు. నాలుగు విడతల్లో ఈ పథకాన్ని అమలుచేయగా చెరువు కట్టల అభివృద్ధి, చెట్ల తొలగింపు, పూడికతీత పనులతో నీటి నిల్వలు, ఆయకట్టు పెరిగింది. అంతేకాక మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయి. జిల్లాలో 869 చెరువుల వద్ద మిషన్ కాకతీయ ద్వారా రూ.207కోట్ల వ్యయంతో పనులు చేపట్టినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

చేపల వంటకాల ఘుమఘుమ

రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మృగశిర కార్తె సందర్భంగా గురువారం నుంచి మూడు రోజుల పాటు ఫిష్ ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్‌పై మత్స్యశాఖ ఆధ్వర్యాన ఈ ఫెస్టివల్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే శిక్షణపొందిన మత్స్యకార కుటుంబాల్లోని మహిళలతో ఇరవై స్టాళ్లు ఏర్పాటుచేయించి చేప పచ్చళ్లు, ఫిష్ బర్గర్, ఫిష్ సమోసా, పకోడి, బిర్యానీ తదితర వంటకాలను జిల్లావాసులకు రుచి చూపించనున్నారు. ఈ విషయమై జిల్లా మత్స్యశాఖ అధికారి డి.ఆంజనేయస్వామి మాట్లాడుతూ ఊరూరా చెరువుల పండుగతో పాటు ఖమ్మం లకారం ట్యాంక్ బండ్‌పై ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ విజయవంతానికి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

క్లుప్తంగా

నేడు మంత్రి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం ఖమ్మంలో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే క్రమాన సూర్యాపేటలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆతర్వాత ఖమ్మం చేరుకుని లకారం ట్యాంక్‌బండ్‌పై చెరువుల పండుగకు హాజరవుతారు.

తప్పుడు సిఫారసుతో అర్చకులకు అన్యాయం

ఖమ్మంగాంధీచౌక్: ధూప, దీప నివేదన అర్చకుల వేతనాలపై అర్చక సమాఖ్య పెద్దలు రాష్ట్ర ప్రభుత్వానికి తప్పుడు సిఫారసులు చేయడంతో నష్టం జరిగిందని సంఘం రాష్ట్ర కార్యదర్శి అన్నవజ్జల ప్రసాద్‌శర్మ, ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మునగలేటి రమేష్‌శర్మ, మరిగంటి భార్గవాచార్యులు ఒక ప్రకటనలో ఆరోపించారు. అర్చకుల కుటుంబ స్థితిగతులను దృష్టిలో పెట్టుకుని ఉద్యోగ భద్రతతో కూడిన రూ.22,500 వేతనం చెల్లించాలని తాము ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయగా, కొందరు రూ.10 వేలు చాలని సిఫారసు చేశారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతున్న నేపథ్యాన అర్చకులకు తగిన న్యాయం చేయాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్ రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై గుర్తుతెలియని వ్యక్తి (40) మూర్ఛ వ్యాధితో మృతిచెందాడు. ఎస్కలేటర్ సమీపాన గుర్తించిన మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన వారు 94932 18856, 87126 58589 నంబర్లలో సంప్రదించాలని జీఆర్పీ ఎస్ఐ భాస్కర్‌రావు సూచించారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కలెక్టరేట్ ఎదుట రెండు కార్లు ఢీ

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెం వద్ద ఖమ్మం–వైరా ప్రధాన రోడ్డుపై కలెక్టరేట్ ఎదుట బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్ స్వాతి తన కారులో ఖమ్మం నుండి కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు యూ టర్న్ తీసుకుంటుండగా, వైరా వైపు నుండి ఖమ్మం వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ధ్వంసం కావడంతో ఇరువురు రఘునాథపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు నమోదు చేస్తామని ఎస్ఐ రవి తెలిపారు.

కొండచిలువ హతం

ఏన్కూరు: మండలంలోని భగవాన్‌నాయక్ తండాకు చెందిన పలువురు ఉపాధి హామీ పథకం నిమిత్తం బుధవారం ఉదయం గ్రామ సమీపాన కొండ ప్రాంతానికి వెళ్లగా కొండచిలువ కనిపించడంతో ఆందోళనకు గురయ్యారు. ఈమేరకు ఎనిమిది అడుగుల కొండచిలువను వారు హతం చేశారు.

రైళ్లిక రయ్ రయ్!

రద్దయిన రైళ్లు రేపటి నుంచి పునః ప్రారంభం

- కాజీపేట – కొండపల్లి సెక్షన్‌లో చకచకా మూడో లైన్ పనులు
- గంటల తరబడి ఆలస్యానికి ఇక చెక్
- ఉమ్మడి జిల్లా ప్రయాణికులకు ఊరట



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : ఉమ్మడి ఖమ్మం జిల్లా మీదుగా వెళ్లే పలు ప్రధాన రైళ్లు రేపటి నుంచి పట్టాలెక్కనున్నాయి. గతంలో తాత్కాలికంగా రద్దయిన రైళ్లన్నీ తిరిగి పునరుద్ధరించాల్సి ఉండగా.. మే నెలలో కురిసిన అకాల వర్షాలతో మూడో రైల్వే లైన్ పనులు సకాలంలో పూర్తి కాలేదు. దీంతో రైళ్ల రద్దు నిర్ణయాన్ని జూన్ 8 వరకు పొడిగిస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం మరో రోజు పొడగింపుతో శుక్రవారం నుంచి యథావిధిగా రాకపోకలు సాగించనున్నాయి.

కొన్ని రైళ్ల తాత్కాలిక రద్దు..

చెన్నై – న్యూఢిల్లీ గ్రాండ్ ట్రంక్ రైల్వే మార్గంలో కీలకమైన కొండపల్లి(విజయవాడ) – కాజీపేట (వరంగల్) సెక్షన్ల మధ్య మూడో లైన్ నిర్మాణ పనులు గత ఐదేళ్లుగా కొనసాగుతున్నాయి. ఇందులో వరంగల్ జిల్లా నెక్కొండ – చింతల్‌పల్లి రైల్వే స్టేషన్ల మధ్య మూడో లైన్ నిర్మాణం పూర్తయింది. ఈ లైన్ మీదుగా రైళ్లు నడిపించాలంటే ప్రధాన మార్గాన్ని ఇంటర్ లాకింగ్ సిగ్నలింగ్ వ్యవస్థతో అనుసంధానం చేయాల్సి ఉంటుంది. ఇలా చేయాలంటే ప్రస్తుతం ఉన్న ఇంటర్ లాకింగ్ వ్యవస్థ మొత్తాన్ని తొలగించి కొత్త సిస్టమ్ ఇన్‌స్టాల్ చేయాలి. అప్పటివరకు ఈ రెండు స్టేషన్ల మధ్య రైళ్లు మాన్యువల్ సిగ్నల్‌పై ఆధారపడి నడిపించాల్సి ఉంటుంది. ఫలితంగా ఈ మార్గంలో అధిక ట్రాఫిక్‌తో రైళ్లు నడిపించడం సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో రైల్వేశాఖ ఉమ్మడి ఖమ్మం జిల్లా మీదుగా రాకపోకలు సాగించే కాకతీయ, సింగరేణి, శాతవాహన, బెళగావి, విజయవాడ – డోర్నకల్ – కాజీపేట, తిరుపతి – కాజీపేట రైళ్లను వివిధ దశల్లో మే 21 నుంచి జూన్ 7 వరకు రద్దు చేసింది. ఫలితంగా ఈ మార్గంలో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించి, సిగ్నలింగ్ పనులు సజావుగా జరిగే వీలు కల్పించింది.

చివరి దశలో ఆటంకం..

మూడో లైన్ సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించి నెక్కొండ స్టేషన్ వద్ద నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తయ్యాయి. కానీ మేలో కురిసిన అకాల వర్షాల కారణంగా చింతల్‌పల్లి స్టేషన్ దగ్గర పనులకు ఆటంకం ఏర్పడింది. దీంతో ముందుగా నిర్ణయించిన జూన్ 7 లోపు అన్ని పనులు కానందున 'రైల్వే ట్రాఫిక్ బ్లాక్'ను జూన్ 8 వరకు పొడిగించాలని రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. దీంతో ఈనెల 8న ఉమ్మడి ఖమ్మం జిల్లా మీదుగా ప్రయాణం సాగించాల్సిన రైళ్లు ఒక రోజు ఆలస్యంగా 9 నుంచి పట్టాల మీద పరుగులు పెట్టనున్నాయి. అయితే రైళ్ల పునఃప్రారంభంలో ఒకరోజు ఆలస్యానికి కారణాలనే వివరించిన రైల్వే శాఖ.. శుక్రవారం నుంచి రైళ్లు నడుస్తాయా లేదా అనే అంశంపై అధికారిక సమాచారం ఇంకా వెల్లడించలేదు.

ఇక నిర్ణీత సమయానికే..

గ్రాండ్‌ట్రంక్ మార్గంలో ఉన్న ఖమ్మం, మధిర స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగించే దూరప్రాంత వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మే 20 నుంచి జూన్ 6 వరకు దారి మళ్లించారు. ఇందులో విశాఖపట్నం – లోకమాన్య తిలక్ టెర్మినల్, షాలిమార్ – సికింద్రాబాద్, పటేల్‌నగర్ (ఢిల్లీ) – కోయంబత్తూర్, యశ్వంత్‌పూర్ – తుగ్లకాబాద్ (ఢిల్లీ), రోయాపురం (చెన్నై)– పటేల్‌నగర్ (ఢిల్లీ), ఓకా – విశ్వేశ్వరయ్య టెర్మినల్ (బెంగళూరు), షాలిమార్ – హైదరాబాద్ రైళ్లు ఉన్నాయి. జూన్ 9 నుంచి ఈ రైళ్లు పాత షెడ్యూల్ ప్రకారమే నడుస్తాయి. ఖమ్మం, మధిర, బోనకల్ తదితర స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగించే కృష్ణా, గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లతో పాటు కోచువెల్లి (తిరువనంతపురం)–కోర్బా, కోచువెల్లి –గోరఖ్‌పూర్ రైళ్లు సమయాల్లో మార్పుల కారణంగా నిర్ణీత సమయం కంటే రెండు నుంచి మూడు గంటల వరకు ఆలస్యంగా నడిచాయి. ఇకపై రెగ్యులర్ షెడ్యూల్‌లోనే ఈ రైళ్లు నడవనున్నాయి.

డప్పుకొట్టి.. నృత్యం చేసి !


మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

వైరాలో బుధవారం నిర్వహించిన సాగునీటి దినోత్సవ వేడుకల్లో వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వైరా రిజర్వాయర్ వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఆయన డప్పు మోగించడమే కాక గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేశారు. – వైరా


డప్పు వాయిస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

సమస్యల పరిష్కారం కోసమే ప్రజాగర్జన

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజా సమస్యల పరిష్కారం, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు డిమాండ్‌తో ఈనెల 11న కొత్తగూడెంలో ప్రజాగర్జన సభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని గిరిప్రసాద్ భవన్‌లో బుధవారం ఎస్.కే.జానీమియా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయాన హామీలు ఇవ్వడం, ఆతర్వాత విస్మరించడం పాలకులకు అలవాటుగా మారిందని ఆరోపించారు. ప్రధాని మోదీ అందరి ఖాతాలో రూ.15 లక్షలు, ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీలను గాలికొదిలేశారని విమర్శించారు. ఈమేరకు హామీలను అమలు చేయాలనే నినాదంతో ఈనెల 11న కొత్తగూడెం ప్రకాశం మైదానంలో జరిగే ప్రజాగర్జన సభకు పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు. అలాగే, సీపీఐ కార్యాలయంలో సింగరేణి డిప్యూటీ కార్యదర్శి మిరియాల రంగయ్య అధ్యక్షతన జరిగిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సమావేశంలో జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మాట్లాడుతూ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈసమావేశాల్లో సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు, సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు జమ్ముల జితేందర్‌రెడ్డి, తాటి వెంకటేశ్వరరావు, అజ్మీరా రామ్మూర్తి, నర్సయ్య, చావా వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, నల్లమోతు వెంకటేశ్వరరావు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

వారు నాటారు.. వీరు నరికేశారు

కొణిజర్ల: హరితహారం పేరుతో గ్రామపంచాయతీ బాధ్యులు మొక్కలు నాటుతుండగా.. విద్యుత్ తీగలకు అడ్డొస్తున్నాయని ట్రాన్స్‌కో ఉద్యోగులు నరికేయిస్తున్నారు. కొణిజర్లలోని ఖమ్మం – సత్తుపల్లి జాతీయ రహదారి వెంట హరితహారంలో రావి, ఇతర మొక్కలను వందల సంఖ్యలో నాటారు. అవి ఏపుగా పెరగగా.. విద్యుత్ లైన్లకు అడ్డొస్తున్నాయని రెండు రోజులుగా ట్రాన్స్‌కో ఉద్యోగులు నరికి వేయించారు. సమన్వయంతో మొక్కలు నాటితే ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదని స్థానికులు పేర్కొన్నారు.


కొణిజర్ల ఎంపీడీఓ కార్యాలయం వద్ద మొదలకంటా నరికిన చెట్లు

వృద్ధురాలి నుంచి గొలుసు చోరీ

కల్లూరురూరల్: మండలంలోని రామకృష్ణాపురంలో బుధవారం వృద్ధురాలి నుంచి దుండుగులు గొలుసు చోరీ చేశారు. గ్రామానికి చెందిన వృద్ధురాలు గుగులోత్ మత్రి తన బడ్డీకొట్టులో ఉండగా, బైక్‌పై ఇద్దరు మాట కలిపి మెడలోని మూడు కాసుల బంగారు గొలుసు లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పరిశుభ్రమైన ఆహారమే తీసుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజలు తీసుకునే ఆహారం విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. నిల్వ ఆహార పదార్థాలు తీసుకుంటే అనారోగ్యం దరి చేరుతుందని తెలిపారు. వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డే సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ప్రజలకు ఆహారపు అలవాట్లు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలని, వేడిగా ఉన్న ఆహారాన్నే తీసుకోవాలని, అపరిశుభ్రత ప్రాంతాల్లో తయారు చేసే ఆహార పదార్థాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే, కల్తీ ఆహారం తయారు చేసే వారి సమాచారాన్ని తమకు అందజేయాలని కోరారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

కామేపల్లి(కారేపల్లి): పిచ్చికుక్కలు స్వైర విహారం చేయగా ముగ్గురికి గాయాలయ్యాయి. కామేపల్లి మండలం పండితాపురంలో ఓ పిచ్చి కుక్కల గుంపు వీధుల్లో తిరుగుతూ కనిపించిన వారిపై దాడి చేశాయి. దీంతో గ్రామానికి చెందిన పగిడిపల్లి రాములు, పోతనబోయిన ముత్తయ్యతో పాటు, రెండేళ్ల చిన్నారి చైత్రకు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు.

గడ్డివామును తగలబెట్టిన సిగరెట్

సత్తుపల్లిరూరల్: ఓ వ్యక్తి పడేసిన సిగరెట్ పక్కనే ఉన్న వరిగడ్డి వాముకు అంటుకోవటంతో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. మండలంలోని రామానగరానికి చెందిన రాజులపాటి రాంబాబు రెండు ఎకరాల గడ్డిని నిల్వ చేయగా, ఓ వ్యక్తి బుధవారం సిగరెట్ తాగాక ఆర్పకుండా పడయడంతో గడ్డివాముకు మంటలు అంటుకున్నాయన్నారు. దీంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో మంటలు ఆర్పినట్లు ఫైర్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఫైర్ సిబ్బంది ఎం.వెంకటేశ్వరరావు, రాజేంద్రన్, యు.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మృగశిర వచ్చేసింది!

నేడు చేపల పండుగ

- ముందురోజు నుంచే జోరందుకున్న అమ్మకాలు
- ఆంధ్రా నుంచి భారీగా దిగుమతి చేసుకున్న వ్యాపారులు


ఖమ్మం త్రీటౌన్ మార్కెట్‌లో చేపలు విక్రయిస్తున్న వ్యాపారులు


భారీ సైజు చేపతో...

ఖమ్మంవ్యవసాయం: మృగశిర కార్తె అనగానే అందరికీ గుర్తొచ్చేది చేపలు. ఈ కార్తె ఆరంభం రోజున చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. అయితే, ఈరోజు చేపలు తినడం వెనక రకరకాల కారణాలను చెబుతారు. వేసవి కారణంగా శరీరంలో వేడి ఎక్కువగా ఉంటుందని.. వర్షాకాలం ఆరంభానికి సూచిక అయిన మృగశిర కార్తె మొదటి రోజున చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని పెద్దలు చెబుతుంటారు. ఈనేపథ్యాన ఏటా మాదిరిగానే గురువారం మృగశిర సందర్భంగా చేపలకు మంచి గిరాకీ ఉంటుందని విక్రయదారులు భావిస్తున్నారు. అయితే, గురువారం ధర పెంచుతారనే భావనతో పలువురు బుధవారమే కొనుగోలు చేయడం విశేషం. జిల్లాలోజిల్లాలో ప్రధానంగా వైరా, పాలేరు రిజర్వాయర్లలో పెద్ద ఎత్తున చేపల పెంపకం జరుగుతుండగా చేపల వేట కొనసాగుతోంది.

ఆంధ్రా నుంచి భారీగా దిగుమతి

మారుతున్న పరిస్థితుల నేపథ్యాన పలువురు చేపలు తినడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈనేపథ్యాన మృగశిర కార్తె రోజు గిరాకీ బాగుంటుందనే భావనతో అమ్మకందారులు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, గోదావరి జిల్లాల నుంచి పెద్ద మొత్తంలో చేపలను దిగుమతి చేసుకుంటున్నారు. జిల్లాలోని జలాశయాల్లో పడుతున్న చేపలు సరిపోవని గుర్తించి ఏపీ నుంచి తెప్పించారు. కాగా, రకం, డిమాండ్ ఆధారంగా చేపల ధర నిర్ణయించే అవకాశముంది. దీంతో ధరలు పెరుగుతాయని కొందరు బుధవారమే చేపలు కొనుగోలు చేశారు. కాగా, కొర్రమేను చేప ధర సాధారణ రోజుల్లో కిలోకు రూ.400 వరకు పలుకుతుండగా మృగశిర రోజున రూ.550వరకు చేరే అవకాశముందని చెబుతున్నారు. ఇక తెల్లచేపలను మిగతా సమయంలో కిలో రూ.150 అమ్ముతున్న వ్యాపారులు సైజ్ ఆధారంగా రూ.170 నుంచి రూ.200వరకు అమ్మాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

వంద టన్నులకు పైగానే..

మృగశిర కార్తెను పురస్కరించుకొని మత్స్యకారులు, విక్రయదారులు గురువారం భారీఆ చేపలను విక్రయించేందుకు సిద్ధమయ్యారు. జిల్లాలోని వివిధ జలాశయాల నుంచే కాక ఇతర జిల్లాలు, సమీపంలోని ఏపీ నుంచి సైతం దాదాపు 100 టన్నుల చేపలను దిగుమతి చేసుకున్నట్లు అంచనా. ఒక్క జిల్లా కేంద్రంలోనే 50 నుంచి 70 టన్నుల చేపలు విక్రయించే అవకాశముంది.

ఇక్కడైతేనే చిక్కుతారని!

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు విద్యాశాఖ ఆధ్వర్యాన 'బడిబాట' కార్యక్రమాన్ని చేపట్టారు. ఎండ కారణంగా విద్యాశాఖ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలను వివరిస్తూ పిల్లలను చేర్పించాలని కోరేందుకు ఉదయాన్నే గ్రామాలకు వెళ్లేలోగా తల్లిదండ్రులకు పనులకు వెళ్లిపోతున్నారు. ఈ నేపథ్యాన కూసుమంచి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం రేల విక్రంరెడ్డి, ఉపాధ్యాయులు బుధవారం ఉదయం మండలంలోని దుబ్బతండా శివారు చెరువులో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకే వెళ్లి తల్లిదండ్రులను కలిసి అవగాహన కల్పించారు. – కూసుమంచి



ఉద్యోగికి 'గ్యారంటీ' భరోసా

సీపీఎస్‌తో పోలిస్తే మరింత మెరుగ్గా జీపీఎస్

- రిటైర్‌మెంట్ తర్వాత చివరి నెల బేసిక్‌లో 50 శాతం మొత్తం పెన్షన్‌తో పాటు ఏటా 2 డీఆర్‌లు
- త్వరలో 12వ పీఆర్సీ ఏర్పాటు
- 10వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ
- 6,840 కొత్త పోస్టుల మంజూరు
- ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ విలీనం
- మంత్రివర్గ సమావేశం అనంతరం మీడియాకు వెల్లడించిన మంత్రి వేణుగోపాలకృష్ణ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో శాశ్వత, కాంట్రాక్టు, సీపీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ అందించేలా గ్యారంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్)ను రూపొందించింది. దీనిద్వారా ఉద్యోగ విరమణ తర్వాత ఆర్థిక భద్రత చేకూరనుంది. రిటైర్ అయిన ఉద్యోగి చివరి నెల మూలవేతనంలో 50 శాతం పెన్షన్, ప్రతి ఆర్నెల్లకు ఒకసారి కరువు భృతి (డీఆర్) ఇవ్వడం ద్వారా మెరుగైన పెన్షన్‌ను అందించనుంది. దీంతోపాటు ఉద్యోగులు అడగకుండానే 12వ పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) ఏర్పాటుతోపాటు 10 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ లాంటి కీలక అంశాలకు బుధవారం సచివాలయంలో సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అనంతరం సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మీడియాకు వివరాలు వెల్లడించారు. మాటప్రకారం సీఎం జగన్ కాంట్రాక్టు ఉద్యోగుల దశాబ్దాల కలను నెరవేర్చారని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తు, ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జీపీఎస్‌ను తీర్చిదిద్దినట్లు వివరించారు. రిటైర్డ్ ఉద్యోగులకు పూర్తి భద్రతనిచ్చేలా రూపొందించిన జీపీఎస్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మంత్రి వేణు ఇంకా ఏమన్నారంటే..

జీపీఎస్‌తో గ్యారంటీ ఇలా..

సీపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీపీఎస్ విధానం ఉద్యోగ విరమణ తర్వాత పెన్షన్‌కు పూర్తి గ్యారంటీ ఇస్తుంది. ఇందులోనూ సీపీఎస్‌లో చెల్లించినట్లే ఉద్యోగి 10 శాతం పెన్షన్ వాటాగా చెల్లిస్తే ప్రభుత్వం కూడా అంతే కడుతుంది. ఉద్యోగ విరమణ సమయంలో చివరి జీతంలో బేసిక్‌లో 50 శాతం పెన్షన్‌గా అందుతుంది. ఇక్కడ సీపీఎస్‌తో పోలిస్తే పెన్షన్ 150 శాతం అధికంగా ఉంటుంది. ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ప్రతి ఆర్నెళ్లకు ఒకసారి ప్రకటించే డీఏలను పరిగణనలోకి



తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రెండు డీఆర్‌లు ఇస్తుంది. ఉదాహరణకు రిటైరైన ఉద్యోగి చివరి నెల బేసిక్ జీతం రూ.లక్ష ఉంటే అందులో రూ.50 వేలు పెన్షన్‌గా వస్తుంది. ఏడాదికి రెండు డీఆర్‌లతో కలుపుకొని ఇది ఏటా పెరుగుతుంది. 62 ఏళ్లకు రిటైర్ అయ్యే వ్యక్తి మరో ఇరవై ఏళ్ల తర్వాత అంటే 82 ఏళ్ల వయసులో జీపీఎస్ ద్వారా రూ.1,10,000 పెన్షన్‌గా తీసుకుంటారు. తద్వారా రిటైర్డ్ ఉద్యోగి జీవన ప్రమాణాలను కాపాడినట్లు అవుతుంది. సీపీఎస్‌లో ఇలాంటి వెసులుబాటు లేదు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇది 2014 జూన్ 2 నాటికి ఐదేళ్లు సర్వీసు ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులందరికీ వర్తిస్తుంది. కటాఫ్ తేదీకి 10 ఏళ్లు ఉండాలని అధికారులు సిఫార్సు చేస్తే సీఎం జగన్ ఐదేళ్లకు తగ్గించారు. జిల్లాల పునర్విభజన తర్వాత కొత్త జిల్లాల్లోనూ ఒకేలా హెచ్‌ఆర్‌ఏ ఉండేందుకు అన్ని జిల్లా కేంద్రాల్లో 16% హెచ్‌ఆర్‌ఏ ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. 2022 జనవరి 1వతేదీ నుంచి డీఏ, డీఆర్ 2.73 శాతం ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదించింది. దీనివల్ల ప్రభుత్వంపై నెలకు రూ.200 కోట్ల అదనపు భారం పడనుంది.

6,840 కొత్త పోస్టుల మంజూరు

నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభ వార్త తెచ్చింది. వివిధ శాఖల్లో సుమారు 6,840 కొత్త పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదించింది. వీటిల్లో 3,920 రిజర్వ్ పోలీసు ఉద్యోగాలు సహా నూతన వైద్య కళాశాలలు, పలు విద్యా సంస్థల్లో భారీ ఎత్తున కొత్త పోస్టులను కల్పించింది. ఏపీ వైద్య విధాన పరిషత్ 1986 యాక్టును రద్దు చేసి 'డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్' శాఖగా మార్చి ప్రభుత్వంలో విలీనం చేయడానికి వీలుగా చట్ట సవరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వైద్య విధాన పరిషత్ స్వయం ప్రతిపత్తి నుంచి ప్రభుత్వంలోకి మారడం ద్వారా 14,658 మంది ఉద్యోగులకు మేలు జరుగుతుంది. వీరికి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే 010 పద్దు కింద వేతనాలను చెల్లించనుంది.

విచారణకు శైలజ కిరణ్ సహకరించలేదు

పదే పదే ఆటంకాలు కల్పించారు

- ప్రశ్నించే అధికారులను అడ్డుకునేందుకు మార్గదర్శి సిబ్బంది ప్రయత్నించారు..
- 25% విచారణ కూడా పూర్తి కాలేదు.. చట్టానికి లోబడే మార్గదర్శి కేసు విచారణ
- శైలజతోపాటు రామోజీని మరోసారి విచారిస్తాం
- త్వరలో మార్గదర్శి నిధుల అటాచ్‌మెంట్ కోసం పిటిషన్
- చందాదారుల ప్రయోజనాల పరిరక్షణకే నిధుల అటాచ్‌మెంట్
- సీఐడీ అదనపు ఎస్పీ రవికుమార్

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో నిందితులుగా ఉన్న చెరుకూరి రామోజీరావు, శైలజ కిరణ్ విచారణకు ఏమాత్రం సహకరించడంలేదని, అయినప్పటికీ తాము చట్టానికి లోబడే విచారణ జరుపుతున్నామని సీఐడీ అదనపు ఎస్పీ రవికుమార్ స్పష్టం చేశారు. ఈనాడు, ఈటీవీ మీడియా సంస్థలు ఉద్దేశపూర్వకంగానే సీఐడీ విచారణపై నిరాధార ఆరోపణలతో తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. ఆయన బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో సీఐడీ ఐజీ సీహెచ్ శ్రీకాంత్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాము శైలజ కిరణ్‌ను ఎలాంటి వేధింపులకు గురిచేయలేదని, ఆమె పట్ల పూర్తి మర్యాదతో వ్యవహరించామని చెప్పారు. ఆమె భోజనం, టీ, మందుల కోసం అవసరమైన ప్రతిసారీ అవకాశం కల్పించామన్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘించి అక్రమాలకు పాల్పడినట్టు కచ్చితమైన ఆధారాలు లభించాయని రవికుమార్ స్పష్టం చేశారు. విచారణ కోసం మంగళవారం శైలజ కిరణ్ నివాసానికి వెళ్లినప్పుడు తమ సిబ్బందిలోని 10 మందిని అనుమతించకుండా అభ్యంతరం తెలిపారన్నారు. ఆర్థిక అక్రమాలను సంబంధించి ఆధారాలపై ప్రశ్నించాల్సిన సాంకేతిక అధికారులను అడ్డుకునేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ సిబ్బంది ప్రయత్నించారని తెలిపారు. తాము చట్టం పరిధిలోనే విచారిస్తున్నప్పటికీ శైలజ కిరణ్ విచారణకు ఏమాత్రం సహకరించకుండా పదే పదే ఆటంకాలు కల్పించేందుకు యత్నించారని చెప్పారు. అక్రమాలకు పాల్పడిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీగా పూర్తి సమాచారాన్ని ఆమె వద్ద ఉంచుకోలేదని, ఇది ఉద్దేశపూర్వకంగానే చేశారని తెలిపారు. ఎండీ వద్ద పూర్తి సమాచారం ఉండాల్సిన అవసరం లేదని కూడా ఆమె వ్యాఖ్యానించారని చెప్పారు. చట్టానికి విరుద్ధంగా నిధుల మళ్లింపుపై వాస్తవాలను కప్పిపుచ్చేందుకు ఆమె పదే పదే ప్రయత్నించారన్నారు. విచారించిన ప్రతిసారీ ఏదో సాకుతో తప్పించుకోవాలన్నదే ఆమె ఉద్దేశంగా ఉందన్నారు. శైలజ కిరణ్ పదే పదే ఆటంకాలు కల్పిస్తుండటంతో తాము అడగాల్సిన ప్రశ్నల్లో 25 శాతం కూడా అడగలేకపోయామని వివరించారు. అందుకే మరోసారి నోటీసులు జారీ చేసి ఆమెను విచారిస్తామని తెలిపారు. ఈ కేసులో రామోజీరావును కూడా మరోసారి విచారిస్తామని చెప్పారు. చందాదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధులు రూ.793.50 కోట్లను అటాచ్ చేసేందుకు న్యాయస్థానంలో త్వరలోనే పిటిషన్ దాఖలు చేస్తామని ఆయన తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న సీఐడీ అధికారులు రవికుమార్, శ్రీకాంత్

డ్రంకెన్ డ్రైవ్‌కు భయపడి..

రాంగ్‌రూట్లో వెళ్లిన యువకుడు

- ఆర్టీసీ బస్సు ఢీకొని అక్కడికక్కడే మృతి
- కరీంనగర్ జిల్లాకేంద్రంలో ఘటన.. స్థానికుల రాస్తారోకో



శ్రీనివాస్(ఫైల్)

కరీంనగర్ క్రైం: డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి భయపడి ఓ యువకుడు.. బైక్ వెనక్కి తిప్పి రాంగ్‌రూట్లో వేగంగా వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లాకేంద్రంలోని బైపాస్‌రోడ్డులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. జిల్లాలోని హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేటకు చెందిన ఎలువాక శ్రీనివాస్(33) పదేళ్లుగా స్థానిక విద్యానగర్‌లో ఉంటూ వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. తన సోదరుడి కూతురు పుట్టినరోజు శుక్రవారం ఉండడంతో బుధవారం రాత్రి పనులు పూర్తిచేసుకుని బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరాడు. నగరంలోని కోతిరాంపూర్ చౌరస్తా నుంచి బద్దంఎల్లారెడ్డి చౌరస్తా వైపు వెళ్తున్నాడు. అక్కడ పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేస్తున్నారు. గమనించిన శ్రీనివాస్ బైక్‌ను వెనక్కి తిప్పాడు. పోలీసులు సైతం శ్రీనివాస్‌ను గమనించి అతడు వెనక్కి వెళ్లకుండా ఆపేందుకు యత్నించారు. ఇంతలో బైక్‌ను వేగంగా నడిపిన శ్రీనివాస్ ఎదురుగా వస్తున్న హుజూరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఢీకొని అక్కడికక్కడే మరణించాడు.

స్థానికుల ఆందోళన

ఘటనను గమనించిన స్థానికులు పోలీసులపై మండిపడ్డారు. పెద్దఎత్తున గూమికూడి బద్దం ఎల్లారెడ్డి చౌరస్తా సమీపంలో రోడ్డుపై అరగంటపాటు ఆందోళనకు దిగారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల కారణంగానే శ్రీనివాస్ మృతిచెందాడని ఆరోపించారు. ట్రాఫిక్ జాం కావడంతో పోలీసు అధికారులు ఘటనాస్థలానికి చేరుకొని ఆందోళన విరమింపజేశారు. శ్రీనివాస్ మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కల్తీ కల్లు అమ్మిన వ్యక్తికి పదేళ్ల జైలు

మనోహరాబాద్(తూప్రాన్): కల్తీ కల్లు అమ్మిన వ్యక్తికి మెదక్ కోర్టు 10 ఏళ్ల జైలు శిక్ష విధించింది. బుధవారం నర్సాపూర్ ఎక్సైజ్ సీఐ పద్మ ఈ కేసు వివరాలు వెల్లడించారు. 2016లో మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలోని కల్లు దుకాణంలో తనిఖీలు నిర్వహించి కల్లు శాంపిల్‌ను నిజామాబాద్‌కు పంపగా అందులో నిషేధిత ఆల్ప్రాజోలం అనే మత్తు పదార్థం ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీనిపై ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం ఈ ఘటనతో సంబంధమున్న నర్సాగౌడ్ అనే వ్యక్తికి మెదక్ అడిషనల్ జడ్జి లక్ష్మీశారద పదేళ్ల జైలు శిక్షతోపాటు లక్ష రూపాయల జరిమానా విధించింది. తీర్పు తర్వాత నర్సాగౌడ్‌ను ఎక్సైజ్ పోలీసులు సంగారెడ్డి జైలుకు తరలించారు.

ధనవంతుల కోసమే ధరణి: వీహెచ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ధనిక రైతుల కోసమే ధరణి పోర్టల్ ఉపయోగపడుతోందని మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు విమర్శించారు. ఆయన బుధవారం గాంధీ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ సభలో సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ గురించి చాలా దృఢమైన వ్యాఖ్యలు చేశారని, ఆయన ప్రజల నుంచి నేరుగా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుండేదని చెప్పారు. గతంలో పేదలకు పంపిణీ చేసిన భూములపై ధరణి పోర్టల్ ద్వారా అప్పటి యజమానులు హక్కులు పొందుతున్నారని చెప్పారు.

మా రూటే సెప‘రేటు’!

▶ మొదటి పేజీ తరువాయి

బ్రోకెన్ రైస్ ఉంటే ఎఫ్‌సీఐ తీసుకోదని.. బ్రోకెన్ తక్కువగా వచ్చే జిల్లాల నుంచి ధాన్యం తెచ్చి పెట్టేలా వెసులుబాటు ఇవ్వాలంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖను కోరాలని వారికి సూచించడమే కాకుండా.. అన్నీ తానై చక్కదిద్దారు. అనుమతి రాగానే యాదాద్రి జిల్లా నుంచి బియ్యాన్ని దిగుమతి చేసుకునేలా మిల్లర్ల సంఘానికి చెందిన ఓ రాష్ట్ర స్థాయి నేతతో కుమ్మక్కయ్యారు.

డబ్బులు చెల్లించిన వారెవరంటే..

అయిజకు చెందిన దేవుడి పేరిట ఉన్న రెండు మిల్లుల యజమానులు సుమారు 35 ఏసీకేలు, గద్వాల ప్రాంతంలో బీరెల్లికి వెళ్లే రహదారి మార్గంలోని రెండు మిల్లుల యజమానులు సుమారు 20 ఏసీకేలు, జమ్ములమ్మ దేవాలయం ప్రాంతంలోని ఓ మిల్లు యజమాని సుమారు 8 ఏసీకేలు, కేటీదొడ్డి మండల పరిధిలో ఉన్న ఓ మిల్లు యజమాని 15 ఏసీకేలు, ఇటిక్యాల మండలం బీచుపల్లి పరిసర ప్రాంతంలోని ఓ మిల్లు యజమాని 25 ఏసీకేలకు సంబంధించిన డబ్బులను యాదాద్రి జిల్లాలోని రైస్ మిల్లు సంఘం రాష్ట్ర నాయకుడి ఖాతాలో జమ చేసినట్లు సమాచారం. దీనిపై గద్వాల జిల్లా డీసీఎస్ఓ రేవతిని సంప్రదించగా.. డబ్బులు తీసుకుంటున్నట్లు వచ్చిన ఆరోపణలు వాస్తవం కాదన్నారు.

జిల్లా వార్తలు

కార్మికుల పీఎఫ్ లెక్కలు ఎప్పటికప్పుడు తెలపాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పర్మనెంట్, కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించిన సీఎంపీఎఫ్ లెక్కల వివరాలు ఎప్పటికప్పుడు వెల్లడించాలని, అందుకోసం మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. రామగుండంలో బుధవారం జరిగిన సీఎంపీఎఫ్ సమావేశంలో సింగరేణి, సీఎంపీఎఫ్ అధికారులతో పాటు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి పర్మనెంట్ కార్మికుల సమస్యలతో పాటు కాంట్రాక్ట్ మారినప్పుడల్లా కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను నాయకులు సీఎంపీఎఫ్ కమిషనర్ మిశ్రా దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు మందా నర్సింహారావు మాట్లాడుతూ ఎన్ని మస్టర్లు చేసినా 26 మస్టర్ల వేతనాలను రికవరీ చేయటంతో కార్మికులకు సరిపడా వేతనాలు అందడం లేదని చెప్పారు. ఈ మేరకు యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి, అవసరమైన వారికి రుణాలు మంజూరు చేసి ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సింగరేణి డైరెక్టర్ (పా) ఎస్.బలరామ్, జీఎంలు చింతల శ్రీనివాస్, కుమార్‌రెడ్డి, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

11న ప్రజాగర్జన

విజయవంతం చేయాలని కూనంనేని పిలుపు



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఈనెల 11న జరిగే ప్రజాగర్జన సభను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన హమాలీ, ఆటో, కారు, తాపీ కార్మికులు, రైతుబజార్, కూరగాయలు, పండ్ల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కష్టజీవులకు, కర్షకులకు పేద వర్గాల వారికి నివాస గృహాలతో పాటు పిల్లలకు ఉచిత విద్య, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పైనే ఉందన్నారు. శ్రమజీవుల పక్షాన నిలిచి పోరాడేది ఎర్రజెండా మాత్రమేనని, ఓడినా, గెలిచినా ప్రజల మధ్య ఉండేది కమ్యూనిస్టులేనని చెప్పారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబిర్‌పాషా, నాయకులు గుత్తుల సత్యనారాయణ, వై.శ్రీనివాస్‌రెడ్డి, మాచర్ల శ్రీను, కంచర్ల జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల గోడు పట్టదా..?

- మంజూరై ఎనిమిదేళ్లయినా పక్కా భవనాల్లేవు
- అద్దె భవనాలూ లేక ఇతర ప్రాంతాల్లో నిర్వహణ
- శాఖల మధ్య కొరవడుతున్న సమన్వయం
- ప్రభుత్వ ఆదేశాలనూ పట్టించుకోని వైనం



ఇల్లెందులో దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉంటున్న అటవీశాఖ ట్రైనింగ్ స్కూల్ హాస్టల్ భవనం

ఇల్లెందురూరల్: పట్టణమైనా.. పల్లె అయినా స్థానికంగా మెరుగైన విద్యాసంస్థలు ఉంటేనే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. స్థానిక విద్యార్థులు ఆయా సంస్థల్లో చేరడానికి ఆసక్తి చూపుతారు. విద్యాసంస్థల వల్ల వ్యాపారాలు సైతం వృద్ధి చెందుతాయి. ఎంతోమందికి ఉపాధి కలుగుతుంది. ఈ క్రమంలో ప్రతి విద్యార్థికి కార్పొరేట్ స్థాయి విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2016 నుంచి విరివిగా గురుకులాలు మంజూరు చేస్తోంది. అయితే సొంత భవనాలు లేక కొన్నింటిని అద్దె భవనాల్లో నిర్వహిస్తుండగా.. మరికొన్ని చోట్ల అద్దె భవనాలు కూడా అందుబాటులో లేక ఇతర పట్టణాల్లో నిర్వహిస్తున్నారు. మంజూరైన చోటే గురుకులాలు నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశంతో ఉన్నతాధికారులలో కొంత కదలిక వచ్చింది.. కానీ విద్యాసంవత్సరం ప్రారంభానికి గడువు సమీపిస్తున్నా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు మాత్రం లేవు.

ఉమ్మడి జిల్లాలో 65 గురుకులాలు

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం 2016లో మైనారిటీ, బీసీ, ఎస్సీ వర్గాల పేరిట ప్రత్యేకంగా గురుకులాలు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాలో మైనారిటీ గురుకులాలు 17, సాంఘిక సంక్షేమ గురుకులాలు 23, బీసీ గురుకులాలు 25 ఉన్నాయి.

స్థానికంగా ఉంటేనే ప్రయోజనం

ఒక్కో గురుకులంలో 500కు మించి విద్యార్థులు చదువుతుంటారు. ఇందులో స్థానికులే ఎక్కువ మంది ఉండే అవకాశం ఉంటుంది. మంజూరైన చోటే పాఠశాల నిర్వహిస్తే అటు విద్యార్థులకు, ఇటు తల్లిదండ్రులకు ఉపయోగంగా ఉంటుంది. తమ పిల్లవాడి ప్రతిభ, యోగక్షేమాలను ఎప్పటికప్పుడు పరిశీలించే వెసులుబాటు కలుగుతుంది. ఎక్కడ మంజూరైన గురుకులాన్ని అక్కడే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినా గురుకులాల సొసైటీలు శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా అందులో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు సౌకర్యాల పేరుతో తమకు అనుకూలంగా ఉండే ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం కూడా తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల్లో ఇదే ఆరోపణ చేసింది. ప్రస్తుతం విద్యాసంవత్సరం ప్రారంభానికి సమయం దగ్గర పడుతున్నా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కేటాయించిన ప్రాంతాలకు గురుకులాలను తరలించే ప్రయత్నం జరగడం లేదని తల్లిదండ్రులు, విద్యార్థులు అంటున్నారు.

సమన్వయ లోపమే కారణమా..

స్థానికంగా గురుకులాల నిర్వహణకు అనువుగా భవనాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లోపించడం, స్థానికంగా ప్రజాప్రతినిధులు తమ బాధ్యతలను విస్మరించడం వంటి కారణాలతోనే గురుకులాలను ఇతర ప్రాంతాలకు తరలించాల్సి వస్తోంది. ఉదాహరణకు ఇల్లెందులో అటవీ, సింగరేణి, సాంఘిక సంక్షేమ శాఖలకు చెందిన భవనాలు ఖాళీగా ఉన్నా.. ఇక్కడికి కేటాయించిన రెండు గురుకులాలను ఇతర మండలాల్లో నిర్వహిస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడమే కారణమని తెలుస్తోంది. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఏ మండలంలో మంజూరైన గురుకులాలు అదే మండలంలో నిర్వహించాలన్న ప్రభుత్వ తాజా ఆదేశంతోనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందిస్తారో లేదో వేచిచూడాల్సిందే.

స్థానికంగానే నిర్వహించాలి



మంజూరైన చోటే గురుకులాలు నిర్వహిస్తే విద్యార్థులకు ఇంటి వద్దే ఉన్నామన్న భావన కలుగుతుంది. చదువుపై దృష్టి సారించే అవకాశం ఏర్పడుతుంది. తల్లిదండ్రులు కూడా తరచూ వచ్చి తమ పిల్లలను చూసుకునే వెసులుబాటు కలుగుతుంది. అధికారులు తక్షణం స్పందించి ఇతర ప్రాంతాలకు తరలిపోయిన గురుకులాలను హెడ్‌క్వార్టర్‌కు మళ్లించాలి.

– అభిమన్యు, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి

అందరికీ ప్రయోజనం



గురుకులాలు మంజూరైన చోటే నిర్వహిస్తే విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాటు స్థానికంగా వ్యాపార వర్గాలకూ ప్రయోజనం చేకూరుతుంది. ప్రతి మండలంలో ప్రభుత్వ ఖాళీ భవనాలు అందుబాటులో ఉన్నా శాఖల మధ్య సమన్వయ లోపంతో సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారిస్తే స్థానికంగానే సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.

– కాంపాటి పృథ్వి, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి

భవనాలు లేక మరోచోట..

మంజూరైన ప్రాంతంలోనే గురుకులాలు నిర్వహిస్తే స్థానిక విద్యార్థులకు కొంత మేర ప్రయోజనకరంగా ఉంటుంది. కానీ అద్దె భవనాలు కూడా అందుబాటులో లేకపోవడంతో ఇతర పట్టణాలు, మండలాల్లో వాటిని నిర్వహిస్తున్నారు. ఇలా ఖమ్మం, వైరా, నేలకొండపల్లి మండలాల్లో మంజూరైన మైనారిటీ గురుకులాలు, తిరుమలాయపాలెం, ముదిగొండ, మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు మండలాల్లో మంజూరైన సాంఘిక సంక్షేమ గురుకులాలు, ఇల్లెందు, చెరువుమాధారం బీసీ గురుకులాలు ప్రస్తుతం ఇతర మండలాల్లో కొనసాగుతున్నాయి.

కేజీబీవీ టీచర్లకు మూలవేతనం ఇప్పిస్తాం

పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల ఉపాధ్యాయులకు కనీస మూలవేతనం ఇప్పించే బాధ్యత తమదేనని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి వెల్లడించారు. ఖమ్మం జెడ్పీ సమావేశ మందిరంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మోత్కూరి మధు అధ్యక్షతన కేజీబీవీ ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించారు. ఈసమావేశంలో ముఖ్యఅతిథిగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ కేజీబీవీల్లో ఇంటర్ విద్య ప్రవేశపెట్టిన నేపథ్యాన స్పెషల్ ఆఫీసర్లపై పనిభారం పెరిగినందున కేర్ టేకర్ల పోస్టులు భర్తీ చేసేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే, మోడల్ స్కూళ్లలో వసతిగృహాల బాధ్యతల నుంచి తప్పించడం, పీఈటీలు, అకౌంటెంట్లకు.. ఇతర పీఈటీలతో సమానంగా వేతనం ఇప్పించేలా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మాట్లాడుతూ పీఆర్సీ 30శాతం పెంపు తమ వల్లే సాధ్యమైందని గుర్తుచేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోత్కూరి మధు, ఆర్.రంగారావు మాట్లాడుతూ సీఎం అపాయింట్‌మెంట్ తీసుకుని కేజీబీవీల సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. ఒక సంఘం నుంచి తప్పుడు మెసేజ్‌లు వచ్చినా ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో హాజరు కావడం ఆనందంగా ఉందని తెలిపారు. కేజీబీవీల బాధ్యురాలు ఝాన్సీసౌజన్య మాట్లాడగా చిత్తలూరి ప్రసాద్, యలమద్ది వెంకటేశ్వర్లు, కట్టా శేఖర్, విజయ్, అమృత్‌కుమార్, హుస్సేన్, రెబ్బా శ్రీనివాసరావు, సుజాత, జయమ్మ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆకాంక్షల కోసం ఉద్యమించండి..

ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



ప్రదర్శనలో పాల్గొన్న పోటు రంగారావు, నాయకులు

సత్తుపల్లిటౌన్: వాగ్దానాలతో కాలం వెళ్లదీస్తూ ప్రజలను ప్రభుత్వం వంచిస్తున్న విషయాన్ని గుర్తించి అందరూ తెలంగాణ ఆకాంక్షల సాధనకు ఉద్యమించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ప్రజా ఆకాంక్షల దీక్షా దివాస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సత్తుపల్లిలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితబంధు పథకాలను నామమాత్రంగా అమలుచేసి రాష్ట్రమంతా బంగారు తెలంగాణగా మారిందని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. స్వరాష్ట్రంలో పోడు సాగుదారులకు కంటి మీద కునుకు లేకుండా దాడులు చేయించారని గుర్తు చేశారు. కానీ, అప్పుడు 11 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలిస్తామని చెప్పి లక్షన్నర ఎకరాలకే పట్టాలిస్తామనడం సరికాదన్నారు. తొలుత నీలం రామచంద్రయ్య భవనం నుంచి తహసీల్ వరకు ప్రదర్శనగా వెళ్లి తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోకినెపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు గంటా శ్రీను, తాటి రాజు, నాగిరెడ్డి, వెంకటేశ్, రాఘవులు, నాగప్రసాద్, నాగరాజు, నర్సమ్మ, దుర్గా, వెంకటమ్మ పాల్గొన్నారు.

నూతన విద్యావిధానం వద్దేవద్దు..



సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌ఎల్ మూర్తి

ఖమ్మంమామిళ్లగూడెం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయాల్సిందేనని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్ మూర్తి డిమాండ్ చేశారు. ఖమ్మం సుందరయ్యభవన్‌లో బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో భాగంగా 'నూతన విద్యావిధానం – ప్రత్యామ్నాయ విధానాలు' అంశంపై ఆయన మాట్లాడారు. నూతన విద్యావిధానం ద్వారా ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడమే కాక ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాసేలా ఉందని ఆరోపించారు. మధ్యతరగతి విద్యార్థులు చదువుకు దూరమయ్యేలా కుట్ర పన్నిన కేంద్రం విధానాలను తిప్పికొడతామని తెలిపారు. ఈ సదస్సులో రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర కిరణ్, శ్రీకాంత్‌వర్మ, నాయకులు వీరభద్రం, మిస్రేస్ సుల్తానా, ప్రవీణ్, పర్వీన్, ప్రశాంత్, రవి, రాగిణి, సుమలత, స్రవంతి పాల్గొన్నారు.